క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామంలో సీతారామ, ఆంజనేయ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

11న ప్రవేశ పరీక్ష

కురుపాం: మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుందరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఎ.ఎం.పి.ఎస్.ఎ.పి.సి–ఎఫ్.ఎస్.ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ


జె.సౌజన్య

వీరఘట్టం: మండల వ్యవసాయాధికారిగా జక్కువ సౌజన్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిబ్బందికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని కొరమ గ్రామ మాజీ సర్పంచ్ అగతముడి కృష్ణారావు(68) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను కలిసి, పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు కృష్ణారావు చిత్రపటానికి పూలమాల వేసి, ఎమ్మెల్యే నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్తకోట ఆంజనేయులు, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, పార్టీ నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు అగతముడి రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొట్టుగుమ్మడలో 'గడప గడపకు'

వీరఘట్టం: మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం ఓ ప్రకటనలో ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

'ఉపాధి' పనుల పరిశీలన


ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: మండలంలోని ఇసుకగెడ్డ, దారబ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ కొండపల్లి సత్యం గురువారం పరిశీలించారు. హార్టికల్చర్‌లో భాగంగా మొక్కలు నాటేందుకు గోతులను వేతనదారులు తవ్వగా, కొలతల ప్రకారం పనులు చేపట్టాలని ఆయన సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈఓగా లిల్లీరాణి


డిప్యూటీ ఈఓకు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలుపుతున్న గిరిజన సంక్షేమ శాఖ డీడీ నగేష్

సీతంపేట: ఐటీడీఏ డిప్యూటీ ఈఓగా ఎ.లిల్లీరాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను గిరిజన సంక్షేమ శాఖ డీడీ నగేష్, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, సూపరింటెండెంట్ దేశ్ పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి


ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మండలంలోని కన్నపుదొరవలస గ్రామంలో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన కొనసాగిస్తున్నారని, ఆయన తన పాదయాత్ర మొదలుకుని, సభలు, సమావేశాలు, సదస్సులు, కార్యక్రమాల్లో ఇచ్చిన ఎన్నో రకాల హామీలను నెరవేర్చారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చి, మాటల సీఎం కాదు, చేతల సీఎం అన్న పేరుతెచ్చుకున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఆయన సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. టీడీపీ అండ్ కో తమ ఉనికిని చాటుకునేందుకు ప్రజలకు మేలు చేస్తున్న జగనన్న ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరగలేదని, ఇదే జగనన్న పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, ఏపీఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, సర్పంచ్ రెడ్డి అన్నపూర్ణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి రవికుమార్, నాయకులు వాన నారాయణరావు, కుమార్, బలగ వెంకటరమణ, అల్లు ఈశ్వరరావు, మరడాన కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

● ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వండవ గ్రామంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితుడు సత్యనారాయణకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా గురువారం అందజేశారు. వివిధ ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయి నిస్సహాయులైన వారికి, పెద్దపెద్ద వ్యాధులతో బాధపడుతూ చికిత్స చేయించుకోలేని వారికి సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో ఒక్క పాలకొండ నియోజకవర్గంలోనే 200 మంది బాధితులకు దాదాపు రూ.4 కోట్ల నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారన్నారు. ఇప్పుడు మూడు నెలల క్రితం వీరఘట్టం మండలంలోని పాపంపేటకు చెందిన పాట్నూరు సత్యనారాయణ హైదరాబాద్‌లో ఓ పరిశ్రమలో పనిచేస్తూ విద్యుత్‌షాక్‌కు గురై, రెండు చేతులను కోల్పోయాడని, మెరుగైన వైద్యం కోసం 20 రోజుల క్రితం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంటే ప్రస్తుతం ఆ నిధులు రావడం వాటిని బాధిత కుటుంబ సభ్యులకు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే కళావతి చొరవ కారణంగానే బాధితులకు న్యాయం జరుగుతుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం


శివపార్వతుల కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు

భామిని: ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మండలంలోని కొరమ గ్రామంలో ఉన్న నీలకంఠేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పురోహితులు దూసి మల్లిబాబు, సింగుపురం చలపతిరావు సంయుక్త ఆధ్వర్యంలో స్ఫటిక లింగానికి ప్రత్యేకాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

● పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్


అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

భామిని: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ కోరారు. మండలంలోని ఘనసర గ్రామంలో కొత్తగా ఏర్పాటు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంటరానితనం, కులవివక్ష రాజ్యమేలుతున్న రోజుల్లో ఓ నిమ్నవర్గానికి చెందిన వ్యక్తి ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందడం యావత్తు భారత జాతికే గొప్పతనమన్నారు. సమసమాజ నిర్మాణంతో పాటు ప్రతీ పేదవానికి ఉచితంగా చదువు అందించి, తద్వారా ఉన్నత స్థానం చేరుకునేలా చేయడమే ఆయన ఆశయమన్నారు. అంతకుముందు సబ్‌కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎస్సీ సంఘ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత తోట సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావు, పెద్దదిమిలి ప్రధానోపాధ్యాయుడు రాగోలు ఆనందరావు, మాజీ ఎంపీపీ భూపతి ఆనందరావు, తహసీల్దార్ నీలాపు అప్పారావు, సర్వేయర్ తోట రామ్మోహనరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, కేవీపీఎస్ నాయకుడు కొప్పర మిన్నారావు, మాజీ సర్పంచ్ ముద్దాడ ఆనందరావు, అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా భూముల రీసర్వే


భూముల రీసర్వేపై సమీక్షిస్తున్న తహసీల్దార్ సోమేశ్వరరావు

పాలకొండ: భూముల రీసర్వే సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో సమావేశమైన ఆయన గ్రామాల వారీగా జరుగుతున్న భూముల రీసర్వేపై సమీక్షించారు. సర్వే జరగని ప్రాంతాల్లో సర్వేను త్వరితగతిన ప్రారంభించాలని, సర్వే జరిగే ప్రాంతాల్లో సర్వేను వేగవంతం చేయాలని, సర్వే పూర్తయిన ప్రాంతాల్లో హద్దురాళ్లను పక్కాగా ఏర్పాటు చేయాలని తెలిపారు. విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఓలు సమన్వయంతో పనిచేసి, గ్రామకంఠాలు, ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, సర్వేయర్ పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందాలి

● ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల విద్యాసంస్థల ప్రిన్సిపాల్‌లతో సమావేశమైన ఆమె పాఠశాలలకు పంపిణీ చేసిన జగనన్న విద్యాకానుక కిట్లను ప్రతీ విద్యార్థికి పంచిపెట్టాలన్నారు. గ్రామాల్లో డ్రాపౌట్ లేకుండా చూడాలన్నారు. బడిఈడు పిల్లలంతా బడికి వచ్చేలా చూడాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి మనబడి నాడు–నేడు పేరిట జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు మళ్లీ పాఠశాలలకు వచ్చే సమయానికి ముందుగానే పాఠశాలల్లో మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. మెనూ ప్రకారమే వారికి భోజనాలు, ఇతర సౌకర్యాలు అందివ్వాలన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీలు నగేష్, సూర్యనారాయణ, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఏటీడబ్ల్యూఓలు శ్రీనివాసరావు, మంగవేణి, డీఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రథయాత్రకు ఏర్పాట్లు


వేలంపాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

పాలకొండ: పట్టణంలో జగన్నాథస్వామి రథయాత్రకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు ఉత్సవాలు చేపట్టేందుకు అధికారులు నిర్ణయించగా, ఉత్సవాల్లో భాగంగా జెయింట్‌వీల్, ప్రసాదాల విక్రయ దుకాణాల ఏర్పాటుకు సంబంధించి, గురువారం వేలంపాట నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన షేక్ అబ్దుల్ ఇమ్రాన్ రూ.1.19 లక్షలకు జెయింట్‌వీల్ ఏర్పాటును, బి.సావిత్రి రూ.26 వేలకు ప్రసాదాలు విక్రయించుకునేందుకు అవకాశం దక్కించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.రాధాకృష్ణ తెలిపారు.

దోమల నివారణ మందు పిచికారీ

భామిని: మండలంలోని భూర్జగూడ గ్రామంలో గురువారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాల బారిన గ్రామస్తులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారి సోయల్ తెలిపారు. ప్రధాన వీధులు, మురుగు కాలువలతో పాటు కొంతమంది ఇంటి లోపల కూడా దోమల నివారణ మందు స్ప్రే చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో విస్తృత స్థాయి సమావేశాలు

గుమ్మలక్ష్మీపురం: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరు డివిజన్ పరిధి, పట్టుచీర గ్రామంలో ఈ నెల 10వ తేదీన, చెన్నంపేట గ్రామంలో 11వ తేదీన ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు యడ్ల సూర్యనారాయణ వెల్లడించారు. ఇదే విషయమై గురువారం మండల కేంద్రంలో సంఘ నాయకులతో సమావేశమైన ఆయన ఆదివాసీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చేపట్టే ఈ సమావేశాలకు అందరూ హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన లక్ష్మీనృసింహ స్వామి భక్తులకు గురువారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రీతికరమైన గురువారం నాడు ప్రత్యేకపూజలు నిర్వహించడానికి స్వామిని అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ భక్తులు దూర ప్రాంతాల నుంచి స్వామివారికి మొక్కులు తీర్చుకునేందుకు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

చురుగ్గా ఈకేవైసీ నమోదు


ఆన్‌లైన్‌లో ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న జిల్లా ఉపఖజానా అధికారి మన్మథరావు

కురుపాం: స్థానిక ఉపఖజానా కార్యాలయంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియ చాలా చురుగ్గా కొనసాగుతోంది. గురువారం జిల్లా ఖజానా అధికారి ఆరిక మన్మధరావు ఈ ప్రక్రియను పరిశీలించి, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి, ఈకేవైసీ ఏ మేరకు పూర్తయిందన్న వివరాలను ఉపఖజానా కార్యాలయం అధికారి కాపు శంకరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలను చూసి, 80 శాతం మేర ఈకేవైసీ పూర్తి కావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మిగతా 20 శాతాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపఖజానా కార్యాలయం సీనియర్ అకౌంటెంట్లు అహల్యకుమార్, నాగేంద్రసాయి తదితరులు పాల్గొన్నారు.

35 మద్యంసీసాల స్వాధీనం


పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న పోలీసులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న 35 మద్యంసీసాలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కళాధర్ తెలిపారు. ఉదయం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వీటిని తీసుకువెళ్తుండగా, సిబ్బంది అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ముగిసిన సాయినామ సప్తాహం


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దాత అచ్యుతరావు

గరుగుబిల్లి: ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న అఖండ సాయినామ సప్తాహం కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఉదయం సుప్రభాత సేవ, సామి వారి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం విశాఖపట్నంలో నివాసముంటున్న పెద్దూరుకు చెందిన కంచెర్ల అచ్యుతరావు తన కుటుంబ సభ్యుల పేరిట పేదలకు చీరలు, పంచెలు వితరణ చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



నవధాన్యాలు కిట్లు అందుకుంటున్న రైతులు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ జె.హేమసుందర్ తెలిపారు. గురువారం మండలంలోని తోటపల్లి, ఉల్లిభద్ర గ్రామ రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు నవధాన్యాల కిట్లను ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాలకు ముందు ఎకరాకు పది కిలోల చొప్పున 20 నుంచి 30 రకాల విత్తనాలను కలిపి, జల్లి దాదాపు 45 రోజుల తర్వాత భూమిలో పంటను కలియదున్నాలన్నారు. ఇలా చేస్తే నేల సారవంతమై, పంటలు బాగా పండుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు తెగుళ్లు, చీడపీడలను తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు, ఉల్లిభద్ర సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వహించవద్దని భద్రగిరి ఐసీడీఎస్ పీఓ సీహెచ్ సుశీలదేవి అన్నారు. మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో గురువారం సమావేశమైన ఆమె పలు సూచనలు చేశారు. ప్రీస్కూల్‌ను సక్రమంగా నిర్వహించాలని, నిర్దేశించిన సమయం ప్రకారమే కేంద్రాలు తెరవాలన్నారు.

123 మందికి ఆరోగ్య తనిఖీలు


ఆరోగ్య తనిఖీల కోసం క్యూలో ఉన్న మహిళలు

కురుపాం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సచివాలయం–1 సమీపంలో రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి, 123 మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి చీకటి శంకరరావు వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి


యువతకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రసాద్

పాలకొండ రూరల్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పడాలని ఎస్ఐ బి.శివప్రసాద్ కోరారు. గురువారం స్థానిక పాలకొండ–సీతంపేట రోడ్డులో సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టిన ఆయన వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అంతకుముందు అటువైపుగా వచ్చే వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్, ఆర్‌సీ బుక్‌లను పరిశీలించడంతో పాటు ట్రిపుల్ రైడింగ్ చేసిన వారు, మద్యంతాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని, ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అధిక లోడుతో వాహనాలు నడపవద్దని తెలిపారు.